ఓంశ్రీసాయిరాం

భారతీయులు అనుష్ఠానప్రియులు, ఆచరణశీలురు. కాబట్టి, శివరాత్రి మొదలైన పవిత్ర పర్వదినములను వాటి అంతరార్థముననుసరించి అనుభవించి, ఆనందించేందుకు, స్వస్వరూపమును గుర్తించి దానిని సాక్షాత్కరించేందుకు కావలసిన సాధనలుకు పూనుకొనేదే పర్వదినముల పరమోద్దేశము. ఆహారవిహారములను ఆరగించేకొరకు కాదు. నిజతత్త్వమును గుర్తించక జీవితమును అంధకారములోనే గడుపుట అజ్ఞానుల రీతియేగానీ వివేక, విచక్షణ, వైరాగ్యముల గుణములను వరప్రసాదముగా పొందియున్న మానవుల లక్షణము కాదు. మానవ జీవితములో ఈశ్వరత్వమును ప్రకటించవలెను. మానవ సమాజమునకు ఈశ్వరత్వమే పునాది. ఈశ్వరత్వమే ప్రధానము. అది అహంకారపూరితమై వుండినప్పుడు వికారమగును. దుఃఖమయమగును.

భారతీయ సంస్కృతియందుకూడ ఇట్టి వికారమూ, వికృతి భావములూ, నవనాగరికతయొక్క ప్రభావము వలన పెరుగుచున్నవి. భగవంతుడు లేడని బల్లగొట్టి చెప్పేవారు భారతీయులలోనే వున్నారు. తీర్థయాత్రలు, క్షేత్రదర్శనములు మూర్ఖత్వమని హేళనము చేయువారు మిక్కిలిగా కలరు. అయితే, దివ్యత్వము యెంతలేదన్నా పోయేది కాదు. తనకు అయిష్టమనిపించినదంతా వ్యర్థమని చేప్పేదికూడ మూర్ఖత్వమే.

ఆధ్యాత్మికము వ్యక్తిగతము కాదు. సమష్టిస్వరూపముగా సాక్షాత్కరించే స్వస్వరూపమే, దాని ఫలితము. ఆధఆ్యత్మిక జీవితాన్ని ఒంటరితనముగాకానీ, ఏకాకి జీవితముగాగానీ యెంచరాదు. మానసిక రాగద్వేషములతో నిమిత్తము లేకుండా, మానవకోటి యావత్తుతో ఏకమై, పరిపూర్ణమై వుండగలిగిన స్థాయి, ఆధ్యాత్మిస్థాయి. ఈ సత్యమును గుర్తించుటకు బుద్ధి ప్రధానమైన ఆధారము. బుద్ధి ద్వారా స్వరూపమును వెతకవలెను. దానిని గుర్తించి, దివ్యత్వమును తెలుసుకొని ఆనందించవలెను.

కాని, ఇప్పుడు ఇట్టి మార్గమునకు విరుద్ధముగా ప్రవర్తించి, భిన్నమార్గమందు బయలుదేరి, అయోమయ జీవితమునబడి బాధపడుదురు. తెల్లవారురుఝామునుండి రాత్రి వరకు బయటనుండి దొరకే సుఖముల కొరకే ప్రాకులాడుట అలవాటైనది. బుద్ధిని అంతర్ముఖముగా ప్రవేశపెట్టి, తద్వారా ఆత్మను గుర్తించేందుకు ప్రయత్నము చేయటము లేదు. పశువులకు బయటదృష్టి సహజము. మానవుల ప్రత్యేకత ఈ లోదృష్టి. మానవుని బయటదృష్టి హానికరముగా వుండును. అన్నమునకు ప్రాకులాడక, ఆత్మను వెతికే బుద్ధిని అభివృద్ధి చేయుటయే మానవుని జీవిత లక్ష్యము.

విద్యలను ఎంత సంపాదించిననూ, బలమెంతయుండిననూ, అధికారములెన్ని పొందిననూ, ప్రశ్న ద్వారా విజ్ఞాన, ప్రజ్ఞాన, సుజ్ఞానముల కొరకై ప్రాకులడవలెను. ఇవి లేకుండుట, వ్యక్తిత్వమునకే అవమానము. ఆహారవిహారముల నిమిత్తమే జీవితమనుకొన్నచో మనిషిగా పుట్టనక్కరలేదు. కుక్కలు, నక్కలు ఆ ఉద్దేశ్యమును నిర్వహించును. అన్నము వెదకేవాడు పాపి, ఆత్మను వెదకేవాడు గోపి, అని గోపికల విషయమై భాగవతములో పేర్కొన్నారుకూడ. చిత్తవృత్తులను, కామక్రోధములను చిమ్మచీకటినుంచి విడుదలచేసేదే ఆధ్యాత్మిక క్రమశిక్షణయొక్క పరమోద్దేశము. మానవులు కామము వలన రాముని మరచిపోదురు. క్రోధమే కామమునకు వెంట, జంట. ఇవి రెండూ మానవుని దానవునిగా తయారుచేయును. పొగ కప్పిన నిప్పువలె, కామము చిత్తములో అణగియుండును. కామతృష్ణకు అంతులేదు.

వీటినుండి విడుదల పొందవలెనన్న, వాటి మూస్థానమేదో కనుగొనుటకు ప్రయత్నించవలెను. అపుడు ఇంద్రియములు, ఇంద్రియములననుసరించే మనస్సూ కామక్రోధములకాధారమని తెలియును. దీనికే పెద్దలు ఇంద్రియనిగ్రహమునుపదేశింతురు. క్షణభంగురమైన విషయవాసనలకు మనోబుద్ధులనంకితముచేసి, వాటిని ఇంద్రియముల మూలకముగా బాహ్యప్రపంచమున విహరింపజేసి, మానవులు అశాంతిలోబడి, పవిత్రమైన ప్రశాంతికి దూరమైపోతున్నారు. జీవిత సైకతముపై పెనుగాలి మేడ నిర్మించి అదే శాశ్వతమని మానవుడు విశ్వసించి అజ్ఞానిగా తయారైపోతున్నాడు. జగత్తులోని ప్రతి పదార్థము స్థిరము కాదు. ఏ ఒక్కటికూడ మానవునకు దక్కేది కాదు. అవన్నీ ఎండమావులు. మానవుని బుద్ధిని మోసగించి భ్రమింపజేసి నిరాశలో ముంచివేయునని తెలిసికొనేదే ఆధ్యాత్మికముయొక్క ప్రథమ సోపానము.

ప్రతియొక్కరికి మానసికశాంతి అత్యవసరము. ధనము, మదము, అధికారము, దేహబలము వీటివలన లభించేది అశాంతికాని, శాంతికాదు. శాంతి దొరకవలెనన్న, ఒక దైవభావమే తగిన ఉపాయము. 'సత్యాన్వేషణ' కు పూనుకోవలెనని ఉపదేశింతురు. సత్యమే తన స్వరూపము. కాబట్టి, దానిని అన్వేషించనక్కరలేదు. దానిని గుర్తించితే చాలు. సత్యమే తానని తేలును. సత్యప్రకటనము చేయుటకు పూనుకొనవలెనుకాని అన్వేషణము అనవసరము. మానవుని సత్యత్త్వము దివ్యత్వమే. దీనిని ప్రకటించు నిమిత్తము మహర్షులు, మహనీయులు పర్వదినములను యెర్పరచినారు. మహాశివరాత్రియొక్క వుద్దేశముకూడ ఇదియే.

ప్రొఫెసర్. గోకాక్ ఇపుడు మీకు మహాశివరాత్రియొక్క విశిష్టతను గురించి తెలిపిరి కదా. శివుడు హాలాహలమును మ్రింగి జగత్తును రక్షించిన దినము, తాండవనృత్యము సలిపిన దినము, ప్రథమముగా లింగాకారమును దాల్చిన దినము అని పురాణములు ఈ పవిత్ర దినమును కొనియాడుచున్నవి. ఇవన్నీ కథలమూలకముగా ఆదర్శములనందించి, మానవునికి తన నిజస్థానమును గుర్తింపజేసే కొరకేగాని, వేరుకాదు. అందని చందమామను వ్రేలుతో చూపించినట్లు, అనుభవములను ఆశయములద్వారా

ఆదర్శములను హృదయమున నాటుటకు చేసే ప్రయత్నములు. ఉదాహరణమునకు, శివరాత్రినాడు ఉపవాస వ్రతములు అంటున్నాము. నవనాగరికతలో పడినవారు, ఈ రాత్రి మూడు లేక నాలుగు సినీమాలకు వెళ్ళి కూర్చొని లేదా పేకాట్లను తెల్లవారేవరకు ఆడి జాగరణ నిర్వహింతురు. చేపలపైనే దృష్టినుంచి ఏకాగ్రతతో ఒంటికాలిపైనిలుచు కొంగకు మోక్షమగునా! కల్లు సారాయి త్రాగి మతి చెడిన అది తన్మయత్వమనిపించునా! భార్యపై కోపముతో భోజనము మాని పస్తుపరుండిన అది ఉపవాసమగునా!

ఒక్కొక్క నియమనిష్ఠకు అంతరార్థమేదని విచారించి తెలిసికొని ఆచరించిన దాని ఫలితము దొరకునుగాని, ఆడంబరము కొరకు, పేరుప్రతిష్ఠల కొరకు, ధనార్జన కొరకు పటములను పూజించటము, విగ్రహములను ప్రతిష్ఠ చేయటము, మందిరములను నిర్మించటము, వ్రతములనాచరించటము ఇవన్నీ నిరర్థకములే. వీరందరూ భగవంతుని సరిగా అర్థముచేసుకొన్నవారు కాదు. అందిరిలోనూ తన ఆరాధనా దైవమున్నాడనే విశ్వాసమును అతి పెద్దగా అభివృద్ధి పరచవలెను. తన కర్మలన్నీ అతనికే అర్పితము. అదే అతని పూజ అను భావము దృఢముగావలెను. అపుడు సదా జాగరణగా సదా ఉపవాసముగా జీవితము జరుగును. కష్టము, నష్టము, విచారణ, విషాదము అన్నీ మరుగైపోవును. నమ్మి చెడినవారు లోకములో లేరు. భగవత్ప్రేమను హృదయక్షేత్రమందు నాటి పెంచితే ఆనందమనే పంట దొరకును.

'ఈశ్వరస్సర్వ భూతానం హృద్దేశేర్జున తిష్టతి' జడమైన విగ్రహములను పూజించేదాని కన్న, సజీవ దేవతా విగ్రహములైన మానవులను సేవించటముచేత నిత్యసత్యమైన ఆత్మానుభూతి లభించి అమితానందము చేకూరును. ఉత్తరప్రదేశమున పరమ భక్తుడొకడు శ్రీకృష్ణుని సాక్షాత్కరించే కొరకు యెవరిని ఆరాధించాలని తర్కించి భక్తపరాధీనుడైన కృష్ణుడు రాధాహృదయమున బంధింపబడియున్నాడని తెలుసుకొని రాధనే ప్రార్థించి శ్రీకృష్ణుని ఆమె దయవలనవీక్షించి తరించవలెననే ఉద్దేశముతో 'రాధా, రాధా, రాధా' అంటూ నాస్మరణలో మునిగినాడు. అతని జీవితము ఆవేదనా పూరితమై భరించుకోలేని తృష్ణతో నిండిపోయినది.

అతడు నివసించు గ్రామము సమీపములోనే సరస్వతీనది ప్రవహించుచున్నది. ఒకదినము ప్రభాతమున, ఆ నదీ తీరమునందున్న రోడ్డుపై ఒక గాజులవాడు పల్లెలగుండ వచ్చుచూ తన గాజుల విక్రయానికి ఆ గ్రామమునకు వచ్చెను. ఆ నది మధ్యన ఒక పల్లెపడుచు బట్టలుతుకుచూ ఆయనను పిలిచినది. ఒక హస్తమునకు గాజులు తొడిగించుకొని ముందుకు వెళ్లు అన్నది. ఆమెయొక్క దివ్యతేజస్సు, కన్నుల ప్రకాశము, మాటల మాధుర్యము వీటిని గమనించి, గాజులవాడు అచ్చటనే తన గంటును దింపి, ఒక హస్తమునకంతా పూర్తిగా గాజులు తొడిగినాడు. 'నా కింక చాలు. గ్రామములో ఫలాని వీధిలో నా తండ్రిగారిని అడిగి నీ డబ్బు తీసుకో' అని ఆమె అన్నదాన్ని అతడు నమ్మినాడు. 'ఒకవేళ నా తండ్రిగారు నా దగ్గర డబ్బు లేదంటే ఆయనకు చెప్పు. పూజాగదిలో ఆయన పూజించే పటమునకు వెనుక గోడకు గూడున్నది. దానిలో నాకియ్యవలసిన డబ్బున్నది'అని. ఆమె మాటలపై పూర్ణవిశ్వాసముతో అతడు ఆ ఇంటికి పోతే, ఆ రాధాభక్తుడు, కృష్ణభక్తుడు 'ఇదేమి ఆశ్చర్యము. వింతగానున్నదే! నాకు పెండ్లి కాలేదు. మరి కూతురెక్కడిది! గోడకు గూడు లేదు. ఎక్కడి గాజులు, ఎక్కడి డబ్బు!' అని కంగారు పడితే గాజులవాడన్నాడి, 'స్వామీ! మీరు పొరపడుతున్నారు. తప్పక వెళ్లి చూడండి' అని. ఆయన పరుగునపోయి పటము వెనుక చూచితే గూడున్నది. డబ్బుకూడ అతనికివ్వలసినదెంతో అంతమాత్రమే వున్నది. ఆయన పరమానంద భరితుడై, 'ఆహా! నా రాధాదేవి నీకు ప్రత్యక్షమై నీచేత గాజులు తొడిగించుకున్నదా! నువ్వెంత ధన్యుడవు. రా! నదీతీరమున నాకు ఆమె దర్శభాగ్యము తలవ్రాతలో నున్నదేమో' అని పరుగెత్తాడు. సరస్వతీ నదీతీరమున నిలిచికొని ఆరాటపడుతూ, స్తోత్రముచేయుచూ, ప్రార్థించినపుడు నీటిపై నిండుగా గాజులు తొడిగిన ఆమె హస్తము మాత్రము దర్శనమిచ్చినది. నీ ముఖపద్మమును ఒక నిముషము దర్శించే భాగ్యము నాకు లేదా, అంటే, అశీరవాణి పలికినది. శ్రీకృష్ణునకు తప్ప అన్యులకు నా ముఖము చూపను. అందరిలోనూ రాధాతత్త్వము, అందరిలోను కృష్ణతత్తవము వున్నది. దానిని ఆరాధించితే ఫలితము లభించును.

జడమైన విగ్రహములు పటములు వీటికంటె సజీవ మానవులనే దైవముగా ఆరాధించి, ద్వేషాసూయలు లేక, సర్వులను ప్రేమించి సేవించండి. అందరిలోనూ శివుడున్నాడు. శివుడు లేనివాడు శవమైపోతాడు కదా! కాబట్టి, దేవుడు ఏ అమరనాధములోనో, కాశీలోనో, భద్రాచలములోనో, తిరుపతిలోనో మాత్రమున్నాడనే భావమును పూర్తిగా తీసివేసి, అతడు సర్వవ్యాపి, సర్వాంతర్యామి. సర్వభూతాంతరాత్మ అని విశ్వసించి అందరినీ దైవభావముతోనే ఆదరించవలెను. శివుడు సర్వవ్యాపకుడు అనే విశ్వాసము మీ శ్వాసగా మారిపోవలెను. ఆ శ్వాసయే స్వస్వరూపముగా సందర్శించుకొనవలెను.

రాత్రి అంటే చీకటితో చేరినది. అయితే, అజ్ఞానాంధకారమును దూరముచేస్తే ఆ చీకటిలోనే ఆనందమును అనుభవించ వచ్చును. దానిని బోధించేదే శివరాత్రి ఉద్దేశము. మంగళకరమైన తన శివతత్త్వమును ప్రకటించుకొరకు ఒక సంవత్సరమంతా కాచుకోనక్కరలేదు. చిత్తములోని వాంఛలను తీసివేసి, హృదయములోని ఆశలను, అజ్ఞానమును పారద్రోలి, దృష్టినుంచి కామక్రోధాదులను నిర్మూలనము చేసిన అదే శివరాత్రి. ప్రేమకు మించిన పరికరము లేదు. నిత్యజీవితములోని ప్రతి పనినికూడా ప్రేమతో ఆచరించండి. భగద్విశ్వాసము పెంచుకొని అన్ని పనులను భగదర్పితముగా శక్తివంచనలేక, భక్తివంచన కాకుండా సలుపండి. జపముగాని, తపముగాని, యోగయాగములుగాని మీరు చేయనక్కరలేదు. నిరంతరము అందరిలోను మంచిమాటలు, మధురభాష, భగవన్నామస్మరణ వుండిన చాలు. పిల్లలు మొదలు పెద్దల వరకు ఈ మార్గముననుసరించిన జీవిత గమ్యమనే దైవానుగ్రహమునకు అందరూ పాత్రులగుదురు.